సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 28 । మే । 2023



దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆర్జీ-2 జీఎం మనోహర్ అన్నారు. 8లో▸



ధాన్యం కొనడం లేదని..

ధాన్యం తూకం వేయడంలో అవకతవకలకు పాల్పడుతున్నారని రైతు దయ్యాల రమేశ్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం నిరసనకు దిగారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
41.0/29.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. ఉక్కపోత విపరీతంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆవిర్భావ వేడుకల ముఖ్య అతిథిగా భానుప్రసాదరావు



పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో జరిగే రాష్ట్ర అవతరణ వేడుకల్లో ముఖ్య అతిథిగా శాసనమండలి చీఫ్‌విప్ భానుప్రసాద రావు పాల్గొననున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న డీఈఓ మాధవి

మంథని: విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలని డీఈవో మాధవి అన్నారు. మంథనిలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్, పూణేకు చెందిన యునిసెఫ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన వేసవి ప్రత్యేక శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. విద్యార్థులు తమ సృజనాత్మకత, జిజ్ఞాసతో వినూత్న ఆవిష్కరణకు బీజం వేయాలన్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే శిబిరంలో విద్యార్థులకు ప్రాజెక్టు డాక్యుమెంటేషన్, మెకానికల్ టూల్స్, త్రీడి ప్రింటింగ్, పేపర్ ఓరిగామి, క్యాడ్ బెసిక్, అడ్వాన్స్ ఎలక్ట్రానిక్స్ ఇతర అంశాలపై విద్యార్థులకు శిక్షణ అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి బి.రవినందన్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శంకర్ పరంజ్యోతి, పుణే రిసోర్స్ పర్సన్ జి.పురుశోత్తం, సుమిత్ శాత్రే, విద్యార్థులు పాల్గొన్నారు.

తుంగబంధం మాటు నిర్మాణానికి సర్వే



సర్వే చేస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

ధర్మారం: మండలంలోని కానంపెల్లి శివారులో నిర్మించతలపెట్టిన తుంగబంధం మాటు కోసం నీటిపారుదల శాఖ డీఈఈ రమేశ్ ఆధ్వర్యంలో శనివారం సర్వే ప్రారంభించారు. సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి మాట్లాడుతూ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు అధికారులు సర్వే చేపట్టారని, మాటు నిర్మాణం పూర్తయితే మండలంలోని పైడిచింతలపల్లి, కానంపెల్లి, రచ్చపల్లిలోని 400 ఎకరాలకు సాగు నీరందుతుందని పేర్కొన్నారు. మాటుకు అనుబంధంగా రెండు కాల్వల నిర్మాణానికి భూసేకరణతోపాటు మాటు నిర్మాణానికి రూ.15 కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. మొదటిరోజు కాల్వల అలైన్‌మెంట్ కోసం సర్వే చేపట్టారని వివరించారు. మాజీ గ్రంథాలయ సంస్థ సభ్యుడు పాక వెంకటేశం, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం త్వరగా దించుకోవాలి



గోదాంలో ధాన్యం నిల్వచేయిస్తున్న అధికారులు

మంథని: మిల్లులకు చేరిన ధాన్యాన్ని మిల్లర్లు త్వరితగతిన దిగుమతి చేసుకోవాలని డీఎస్‌ఓ వెంకటేశ్ సూచించారు. మండలంలోని రైస్ మిల్లర్లతో మాట్లాడి.. అక్కడే ఉన్న లారీలను అన్‌లోడ్ చేయించారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అసౌక్యం కలగనీయొద్దన్నారు. సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, పీఏసీఎస్ సీఈఓ మామిడాల అశోక్‌కుమార్ ఉన్నారు. సూరయ్యపల్లి రైస్‌మిల్లులో స్థలం కొరత కారణంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ గోదాంలో ధాన్యం దిగుమతి చేయించారు.

ఫిష్ ఫెస్టివల్ స్టాళ్లకు 30 తుదిగడువు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జూన్ 8, 9, 10 తేదీల్లో నిర్వహించే ఫిష్ ఫెస్టివల్ స్టాళ్ల కోసం ఈనెల 30లోగా కార్యాలయంలో సంప్రదించాలని జిల్లా మత్స్య శాఖ అధికారి భాస్కర్ తెలిపారు. ఫిష్ ఫెస్టివల్ సందర్భంగా చేప ఉత్పత్తులతో రకరకాల వంటలు, పచ్చళ్లు తయారు చేసి అమ్ముకునే ఔత్సాహికులైన మత్స్య సహకారసంఘాల సభ్యులు, పారిశ్రామికవేత్తలు స్టాళ్ల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 99662 25646నంబర్‌లో సంప్రదించాలన్నారు.



సివిల్స్ ఎవరైనా సాధించవచ్చు

- లక్ష్యసాధనతో ముందుకు సాగాలి
- సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి
- ప్రిపరేషన్ టైమ్‌లో సినిమాలు చూశా
- సీనియర్ల సలహాలు తీసుకున్నా..
- కుటుంబంలో టీచర్లు ఉండడం కలిసొచ్చింది

'సాక్షి'తో సివిల్స్ 94వ ర్యాంకర్ ఆవుల సాయికృష్ణ

సాక్షిప్రతినిధి, కరీంనగర్: 'ప్రస్తుత ఇంటర్నెట్ యుగంలో పేద, ధనిక తేడాలేదు. ప్రతిభ ఉన్న ఎవరైనా కల నెరవేర్చుకోవచ్చు. ఏ పోటీపరీక్షకైనా ఆన్‌లైన్‌లో బోలెడు కంటెంట్, మెటీరియల్ ఉంది. ప్రణాళిక, పట్టుదల ఉంటే కోచింగ్ అక్కర్లేదు. దినపత్రికలు చదవాలి. నోట్స్ తయారు చేసుకోవాలి. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి.' అని సివిల్స్ విజేత సాయికృష్ణ అన్నారు. కరీంనగర్‌కు తొలిసారిగా వచ్చిన ఆయన శనివారం 'సాక్షి'తో ముచ్చటించారు. ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే..

సండే స్పెషల్

పట్టుదల ఉంటే.. కోచింగ్ అక్కర్లే



తన కలనే మా కల

సాయి చిన్నప్పటి నుంచే ఐఏఎస్ కావాలని లక్ష్యంగా పెరిగాడు. అందు కోసం నిరంతరం శ్రమించాడు. తన కలను మా కలగానే అనుకుని అన్ని విధాలా సహకరించాం. ఈ సుదీర్ఘ ప్రయాణంలో అతను అడిగినవన్నీ సమకూర్చాం. 2017లోనే ఐసీఎల్ఎస్ వచ్చినా సంతృప్తి చెందలేదు. తన స్వప్నం సాకారం కోసం రాత్రింబవళ్లు శ్రమించాడు. చివరికి సాధించాడు.

\- ఆవుల లక్ష్మయ్య

ప్రైవేటు ఉద్యోగాన్ని వదులుకున్నాడు

2015లోనే నా కుమారుడు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో సెలెక్టయ్యాడు. తల్లిదండ్రులుగా మేమెంతో ఆనందపడ్డాం. ఆకర్షణీయమైన ప్యాకేజీ చేతికి అందినా పక్కనబెట్టాడు. తన కలల వైపు అడుగులేశాడు. చివరికి నా కొడుకు తన కలను నెరవేర్చుకున్నాడు. ఈ రోజు ఇంకా సంతోషిస్తున్నాం.

\- ఆవుల సునీత

సోషల్ మీడియాకు దూరం

సోషల్‌మీడియాకు దూరంగా ఉన్నాను. కంటెంట్ కోసమే ఆన్‌లైన్‌లో సెర్చ్ చేశాను. లక్ష్యసాధనకు అవసరమైన సమాచారం కోసమే యూ ట్యూబ్, గూగుల్‌లో సెర్చ్ చేశాను. అది నాకు ఎంతగానో ఉపయోగపడింది. అప్పుడప్పుడు సినిమాలు కూడా చూశాను. కానీ పరిమితంగానే చూశాను. ఈ కాలం తల్లిదండ్రులు తమ పిల్లలకు పాఠశాల దశలోనే ఐఏఎస్, ఐఐటీ కోర్సులు అంటూ నేర్పిస్తున్నారు. ఇది కొంత ఇబ్బందికరమే. పాఠశాల, ఇంటర్ స్థాయిలో ఐఐటీ, ఐఏఎస్ కోచింగ్‌లు ఇప్పించడం సరికాదు. ప్రతీ విద్యార్థి తనకంటూ ప్రత్యేకమైన టాలెంట్ ఉంటుంది. అది తెలుసుకొని అటువైపు వెళ్తే సక్సెస్ అవుతారు. అయితే కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ తెలుసుకోవడం ప్రతీ విద్యార్థికి అవసరమే. ఏ పోటీ పరీక్షల్లోనైన కరెంట్ అఫైర్స్‌పై పట్టు ఉంటేనే రాణించగలుగుతారు.

లక్ష్యసాధనకు ఏడేళ్ల తపస్సు

సివిల్స్ నా చిన్ననాటి కల. దాని కోసం ఏడేళ్లు తపస్సు చేశా. నేను పడ్డ కష్టానికి ఫలితం దక్కింది. సివిల్స్‌లో 94వ ర్యాంక్ రావడం ఆనందంగా ఉంది. నాలుగో తరగతిలో ఉన్నప్పుడు జిల్లాకు కలెక్టర్‌గా సుమితా డావ్రా వచ్చారు. ఆమె గురించి అందరూ గొప్పగా చెబుతుంటే విని స్ఫూర్తి పొందాను. కరీంనగర్‌పై ఆమె రాసిన 'పూర్ బట్ స్పిరిటెడ్ కరీంనగర్' పుస్తకం నాకు ప్రేరణనిచ్చింది.

ఆన్‌లైన్‌లో మెటీరియల్ ఎక్కువే..

ఇంటర్నెట్లో అన్ని పరీక్షల మెటీరియల్ దొరుకుతుంది.ఆ మెటీరియల్ సివిల్స్ ప్రిపేర్ అయ్యే వారికి చాలా ఉపయోగకరంగా ఉంది. ఇంగ్లిష్ వస్తేనే సివిల్స్ సాధిస్తామనే అపోహను వీడాలి. మన మాతృభాషలో కూడా పరీక్ష రాసే అవకాశం ఉంది. ఇంటర్వ్యూ సైతం మాతృభాషలోనే నిర్వహిస్తారు. కోచింగ్ తీసుకోవాలనే అపోహ, ఇంగ్లిష్ రాదనే భయం వీడితే ఎవరైన సివిల్స్ సాధించవచ్చు.

కుటుంబమే పెద్ద అండ

సివిల్స్ ప్రిపరేషన్‌లో కుటుంబం అండగా నిలిచింది. నాన్న, మామయ్యలు, అత్తయ్యలు ఎనిమిది మంది వరకు ప్రభుత్వ టీచర్లే.వారి ద్వారా స్ఫూర్తి పొందేవాడిని. 2015లో క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగం వస్తే చేరకున్నా ఎవరూ ఏమీ అనలేదు.ఇంటికే పేపర్ వస్తుండడంతో చిన్నప్పటి నుంచే దినపత్రికలు చదవడం అలవాటుగా మారింది. ఈ అలవాటు సివిల్స్‌కు ఎంతో ఉపయోగపడింది.

సొంతంగా నోట్స్ తయారు చేసుకున్నా..

వరంగల్ ఎన్ఐటీలో 2015లో బీటెక్ పూర్తయ్యింది. ఢిల్లీకి వెళ్లి సివిల్స్ కోచింగ్ తీసుకున్న. సొంతంగా నోట్స్ తయారు చేసుకున్న. 2017 సివిల్స్‌లో 728వ ర్యాంకుతో ఐసీఎల్ఎస్ వచ్చింది. నా లక్ష్యం ఐఏఎస్ కావడంతో మళ్లీ ప్రిపేర్ అయ్యాను. రోజుకు 5 నుంచి 7 గంటలు చదివాను. ఈ క్రమంలో మా సీనియర్ తక్కల్లపల్లి యశ్వంత్‌రావు ఇచ్చిన సలహాలు చాలా ఉపయోగపడ్డాయి.

అడ్డుకోండి చూద్దాం!

గోదావరిఖనిలోని తిలక్‌నగర్, హనుమాన్‌నగర్, ఇందిరానగర్, గంగానగర్, గాంధీనగర్, శివాజీనగర్, విఠల్‌నగర్, ఫైవింక్లైన్ చౌరస్తా.. ఈ ప్రాంతాల్లో రౌడీలు రాజ్యమేలుతున్నారు. వీరిపట్ల ప్రజల్లో ఉన్న భయం.. క్రేజ్ చూస్తున్న కొంతమంది జులాయిలు దారి తప్పుతున్నారు. గంజాయి వినియోగం పెరగడం.. దానికి అలవాటుపడిన యువత గ్యాంగ్‌లలో చేరి వీరంగం సృష్టించడం పరిపాటిగా మారింది. ఫలితంగా గోదావరిఖనిలో నేరాలు కొత్తదారులు తొక్కుతూ.. హద్దుమీరుతున్నాయి.

- నేరాలకు కేరాఫ్‌గా గోదావరిఖని
- హత్యలు, దాడులు ఇక్కడ నిత్యకృత్యం
- హద్దుమీరుతున్నా.. అదుపులేదు..
- దారితప్పి పేట్రేగిపోతున్న జులాయిలు



గోదావరిఖనిలో ఘర్షణలకు దిగి.. దాడి చేసుకున్న యువకులు

సాక్షి, పెద్దపల్లి:

గోదావరిఖని అంటే సింగరేణి బొగ్గుబావులు, పరిశ్రమలకు నిలయం ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. మరోవైపు కొట్లాటలు, దాడులు, హత్యలు గ్యాంగ్‌వార్‌లతో చెలరేగిపోయే రౌడీయిజం ఇక్కడ నిత్యకృత్యం. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా కొత్త పద్ధతుల్లో క్రైం, గ్యాంగ్‌వార్‌లు కొనసాగించడం స్టైల్‌గా మారింది. రామగుండం కమిషనరేట్‌కు కూతవేటు దూరంలోనే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. సమస్య జరిగినప్పుడే నాలుగు రోజుల హడావుడి తరువాత మళ్లీ ఎప్పటి కథేననే భావన నెలకొనడంతో రౌడీషీటర్లు విచ్చలవిడిగా చెలరేగిపోతున్నారు.

పెట్రోలింగ్ లేక..

గోదావరిఖనిలోని విఠల్‌నగర్, ధూల్‌పేట గంజాయి, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. సింగరేణి ఉద్యోగుల పిల్లలు అధికంగా ఉండే ఈ ప్రాంతాల్లో వారిని టార్గెట్‌గా గంజాయి దందా కొనసాగుతోంది. గంజాయి మత్తులో రోడ్లు మీద బైక్‌లతో విన్యాసాలు చేస్తూ.. రోడ్డుపై వెళ్లే వారిని ఇబ్బందికి గురిచేయడం పరిపాటిగా మారింది. సమస్యాత్మక ప్రాంతాల్లో నిత్యం పెట్రోలింగ్ చేయాల్సిన పోలీస్ అధికారులు.. నామమాత్రంగా చేయడం, లేదా గంపులుగా ఉన్నవారిని చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. శనివారం ఫైవింక్లయిన్‌లో ఉదయం యువకులు రక్తాలు వచ్చేలా దాడులు చేసుకున్నా అటువైపు పెట్రోలింగ్ వాహనమే రాలేదని స్థానికులు చెబుతున్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో 431మంది రౌడీషీటర్లు ఉన్నారు. చాలామంది రౌడీషీటర్లు గంజాయి దందా చేస్తుండటంతో గంజాయికి అలవాటుపడిన యువత తెలియకుండానే ఆ గ్యాంగ్‌లల్లో చేరుతూ దారితప్పుతున్నారు.

పోలీసుల ఉదాసీనతే కారణం

గోదావరిఖనిలో ప్రధానంగా పలు కాలనీల్లో రౌడీమూకల సమస్య తీవ్రంగా ఉన్న విషయం పోలీసులతోపాటు అందరికీ సమాచారం ఉంది. ఆయా ప్రాంతాల్లో జులాయిలు ఆగడాలు పెరుగుతున్నా తమకెందుకులే అని పోలీసులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఒకవేళ రోడ్డుపై బీభత్సం సృష్టిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నా రాజకీయ ఒత్తిడి కారణంగా ఏమీ చేయలేకపోతున్నామని పోలీసుల చెబుతున్నారు. పోలీసులు జోక్యం చేసుకోకపోతే జులాయిల ఆగడాలు అదుపుతప్పి మరిన్ని దారుణాలకు పాల్పడే అవకాశముందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎవరినీ ఉపేక్షించం..

ఎవరైనా.. ఎంతటివారైనా ప్రజలను ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతున్నాం. రాత్రి వేళ రోడ్ల పై అనవసరంగా తిరిగితే కేసులు నమోదు చేస్తాం.

\- ప్రమోద్‌రావు, గోదావరిఖని వన్‌టౌన్ సీఐ

ఈ దుర్వాసన భరించలేం బాబోయ్

- వ్యాపారుల వినూత్న నిరసన
- మద్దతు ప్రకటించిన అధికార పార్టీ కార్పొరేటర్
- మేయర్, కమిషనర్ హామీతో విరమణ



ముక్కు మూసుకుని నిరసన తెల్పుతున్న వ్యాపారులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని కళ్యాణ్‌నగర్ ప్రధాన రహదారి మధ్య మ్యాన్‌హోల్ లీకేజీతో మురుగంతా రోడ్డుపై ప్రవహిస్తుంటే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని పేర్కొంటూ వ్యాపారులు శనివారం అక్కడే ముక్కుమూసుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. బల్దియా అధికారుల వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారికి అధికార పార్టీ కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకుడు ఘన్ముక్కుల తిరుపతి మద్దతు తెలిపారు. ప్రధాన వ్యాపార కూడలిలో ఆర్నెళ్లుగా మురుగునీరు లీకేజీతో వ్యాపారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నామని మేయర్, కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. డ్రైయినేజీ నీటితో దుర్వాసన వస్తోందని, వాహనాల రాకపోలతో షాపుల్లోకి చిల్లుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మేయర్ అనిల్‌కుమార్, కమిషనర్ సుమన్‌రావు కొత్త అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతోపాటు త్వరలోనే బీటీ రోడ్డు నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. దీంతో నిరసన విరమించారు. వ్యాపారులు చొక్కారపు వెంకటేశ్వర్లు, ధోతి సత్తయ్య, అప్పల విలాస్, నగునూరి సత్యప్రసాద్, గడ్డం సత్యనారాయణ, వెంకన్న, రావికంటి తిరుపతి, తణుకు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులూ.. ఆల్ ది బెస్ట్



రాష్ట్రస్థాయి పోటీలకు బయల్దేరిన క్రీడాకారులు, అధికారులను జెండా ఊపి పంపిస్తున్న కలెక్టర్ సంగీత

- సీఎం కప్ రాష్ట్రపోటీలకు తరలిన జిల్లా క్రీడాకారులు
- రాష్ట్రస్థాయిలోనూ రాణించాలని కలెక్టర్ సంగీత ఆకాంక్ష

పెద్దపల్లిరూరల్: సీఎం కప్ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు శనివారం హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. రాష్ట్రస్థాయిలోనూ గెలుపొంది జిల్లాకు మంచి పేరు తేవాలని కలెక్టర్ సంగీత అన్నారు. జిల్లా నుంచి 159మంది క్రీడాకారులు, 23మంది కోచ్‌లు, లైజన్ అధికారులు బయల్దేరగా.. బస్సులను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ నెల 28నుంచి 31 వరకు హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియం, గచ్చిబౌలి, సరూర్‌నగర్, జింఖానాగ్రౌండ్స్, కేవీబీఆర్, యూసుఫ్‌గూడ స్టేడియంలో సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. స్థానికసంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్, క్రీడలశాఖ అధికారి తిరుపతిరావు, డీఈఓ మాధవి, డీఎంఓ ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు.

సీఎం కప్ సాధిస్తే రూ.25వేల నజరానా

పెద్దపల్లిరూరల్: జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీకి ఎంపికైన వాలీబాల్ జట్టు క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో కప్ సాధిస్తే జట్టుకు రూ.25వేలు బహుమతిగా అందిస్తానని, రన్నర్‌గా నిలిస్తే రూ.10వేలు అందిస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ తెలిపారు. జట్టు క్రీడాకారులకు అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలసి శనివారం టీషర్టులు అందించారు. బొమ్మ సతీశ్, రాజశేఖర్, మహేశ్, శృనిక్, రాజు, కేతన్ తదితరులున్నారు.

ప్రభుత్వాసుపత్రిలో తన్నుకున్న థర్డ్‌పార్టీ సిబ్బంది

మంథని: మంథని సామాజిక వైద్యశాల పాలన గాడితప్పింది. ఆస్పత్రిలో పనిచేసే సెక్యూరిటీ గార్డు, వార్డుబాయ్ శనివారం ఘర్షణ పడ్డారు. ఒకరినొకరు తన్నుకున్నారు. ఆస్పత్రిలోని పరికరాలను ధ్వంసం చేశారు. థర్డ్‌పార్టీ ఉద్యోగులు ఘర్షణ పడడంతో రోగులు భయాందోళనకు గురయ్యారు. ఐపీ వార్డు నుంచి రోగులు బయటకు వచ్చి కూర్చోవాల్సి వచ్చింది. ఆస్పత్రిలో అధ్వాన పరిస్థితులు మారినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేశారు.



సిబ్బంది చేతిలో ధ్వంసమైన కుర్చీలు

క్లుప్తంగా

ధాన్యం తరలింపునకు లారీల అడ్డగింత



సుల్తానాబాద్(పెద్దపల్లి): ధాన్యం కొనుగోలు కేంద్రాలకు శనివారం లారీలు రాలేదు. దీంతో తూకం వేసిన ధాన్యం కేంద్రాల్లో ఉండటంతో అధికారులు లారీల కోసం పోలీసులు, రవాణాశాఖ అధికారులను ఆశ్రయించారు. దీంతో వారు రాజీవ్ రహదారి వెంట వెళ్లే లారీలను అడ్డగించి, కొనుగోలు కేంద్రాలకు పంపించారు. ధాన్యం రవాణా వేగవంతం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఆగివున్న లారీని ఢీకొన్న కారు

- నలుగురికి తీవ్ర గాయాలు
- అదే కారును ఢీకొట్టిన మరో కారు



సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): ఆగివున్న లారీని ఓ కారు ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందినవారు శనివారం ఆస్ట్రేలియా నుంచి రాగా కుటుంబసభ్యులు హైదరాబాద్ నుంచి కారులో తీసుకువస్తున్నారు. సుల్తానాబాద్ మండలంలోని నర్సయ్యపల్లి స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై ఆగివున్న లారీని ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు మహిళలు, ఒక పాప, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. తర్వాత ప్రమాదానికి గురైన ఆ కారును మరో కారు ఢీకొట్టగా అందులో ఉన్నవారు క్షేమంగా బయటపడ్డారు. బాధితుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు.

ధాన్యం దారి మళ్లించే యత్నం?

మంథని: మంథని మున్సిపాలిటీ పరిధి పవర్ హౌజ్ కాలనీ కొనుగోలు కేంద్రం నుంచి సుల్తానాబాద్ మండలం పూసాల రైస్‌మిల్‌కు 605 బస్తాలు (242 క్వింటాళ్లు) ధాన్యం అలాట్ చేశారు అధికారులు. ఆ ధాన్యం లోడ్‌తో బయల్దేరిన వాహనం మంథని సమీపంలోని కూచిరాజ్‌పల్లి మిల్లులో దించే ప్రయత్నాలు జరిగాయని అధికారులకు సమాచారం అందింది. వెంటనే సివిల్ సప్లయ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు పూసాల రవీందర్, రాజేంద్రప్రసాద్ కూచిరాజ్‌పల్లి మిల్లులో విచారణ చేపట్టారు. అయితే రైస్‌మిల్లు వద్ద వాహనం నిలిపి సేదదీరాడని, ధాన్యం మాత్రం దించలేదని మిల్లు యజమాని తెలిపాడు. ఇదే విషయాన్ని జిల్లా సివిల్ సప్లై అధికారి తోట వెంకటేశ్వర్లుకు తెలపడంతో ఆయన కూడా సదరు మిల్లులో పనిచేసే సిబ్బంది నుంచి వాంగ్మూలం తీసుకున్నారు.



ట్రక్‌షీట్

అక్కడే ఎందుకు ఆగినట్లు?

మంథని కొనుగోలు కేంద్రం నుంచి బయల్దేరిన ధాన్యం లోడ్ వాహనం సుల్తానాబాద్ మండల పూసాల రైస్‌మిల్లుకు వెళ్లకుండా కూచిరాజ్‌పల్లి మిల్లు వద్ద ఎందుకు ఆగినట్లు..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ డ్రైవర్ సేద తీరాలంటే ఏదో చెట్టు కింద నిలపకుండా మిల్లులోకి వెళ్లే ప్రయత్నం ఎందుకు చేస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి. సదరు మిల్లు యజమాని ఆ సమయంలో అందుబాటులో లేడని, మిల్లులో ఉన్న వ్యక్తికి వాహనాలు వచ్చిన సమాచారం ఇవ్వడంతో ఆయన వెళ్లిపొమ్మని చెప్పాడనే తెలుస్తోంది. జిల్లా అధికారులు రంగంలోకి దిగడంతోనే ధాన్యం దింపకుండా సదరు లారీ అక్కడి నుంచి వెళ్లినట్లు తెలుస్తోంది. ట్రక్‌షీట్‌తో బయల్దేరిన వాహనం అలాట్ చేసిన మిల్లుకు రాకుండా మరోచోట దించే ప్రయత్నం విఫలమైందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గోదావరిఖనిలో యువకుల వీరంగం

- ఏటీఎం అద్దాలు ధ్వంసం
- గ్లాస్ ముక్కలతో దాడి చేసుకున్న ఇరువర్గాలు
- 10 మందిపై కేసు

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖనిలో యువకులు వీరంగం సృష్టించారు. ఇరువర్గాల మధ్య మొదలైన ఘర్షణ హోటల్‌లో ఉన్న గరిటెలతో ఏటీఎం అద్దాలు పగులగొట్టి, గ్లాస్ ముక్కలతో దాడి చేసుకునేవరకు వెళ్లింది. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఇద్దరు యువకులు శనివారం తెల్లవారుజామున 4 గంటలకు కారులో గోదావరిఖని ఫైవింక్లయిన్ చౌరస్తా సమీపంలోని హోటల్ వద్దకు టిఫిన్ కోసం వచ్చారు. అదే సమయంలో అక్కడికి ద్విచక్ర వాహనంపై వచ్చిన యువకుడితో వారికి గొడవ



గాయపడిన యువకులు

మొదలైంది. ఇరువర్గాలు తమకు సంబంధించిన వారికి ఫోన్ చేసి, పిలిపించుకున్నారు. తర్వాత పోటీపడి, దాడి చేసుకున్నారు. హోటల్‌లో ఉన్న గరిటెలు, ఫోర్క్‌లతో పక్కనే ఉన్న ఏటీఎం అద్దాలు పగులగొట్టారు. ఆ గ్లాస్ ముక్కలతో దాడి చేసుకోవడంతో అక్కడున్నవారు భయాందోళనకు గురయ్యారు. ఈ సంఘటనలో ఇరువర్గాల వారికి గాయాలయ్యాయి. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై రమేశ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన యువకులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. చిన్న విషయానికే వీరందరూ గొడవ పడ్డారని, ఒక వర్గానికి చెందిన ప్రసన్నకుమార్, హరినివాస్, అజయ్, రాహుల్, రెండో వర్గానికి చెందిన లక్ష్మణ్, రోహిత్, శ్రీకాంత్, తాజుద్దీన్, శివసాగర్, బబ్లూలపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



ధ్వంసమైన ఏటీఎం అద్దాలు

ఒరియా కాలనీలో కార్డెన్ సెర్చ్

రామగుండం: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు సమీపంలోని ఒరియా కాలనీలో శనివారం వేకువజామున రామగుండం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. వివిధ పోలీస్‌స్టేషన్ల నుంచి వందలాది మంది సిబ్బందితో పోలీసు వాహనాల కాన్వాయ్ ఒక్కసారిగా కాలనీకి రావడం, ఒక్కో ఇంట్లోకి వెళ్లి, సోదాలు చేయడంతో ఏం జరుగుతుందో తెలియక స్థానికులు ఆందోళన చెందారు. కొంతసేపటికి కార్డెన్ సెర్చ్ చేస్తున్నట్లు ప్రచారం జరగడంతో ఊపిరి పీల్చుకున్నారు. తర్వాత పోలీసులు ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లతోపాటు కాలనీవాసులను ఒక్కచోటకు చేర్చి, సమావేశం నిర్వహించారు. సెల్‌ఫోన్లలో వచ్చే మెస్సేజీలకు స్పందించి, అపరిచిత వ్యక్తులకు ఓటీపీ చెబితే తమ బ్యాంకు ఖాతాలోని డబ్బులు మాయమవుతాయని తెలిపారు. అలాంటి బాధితులు తక్షణమే 1930 నంబర్‌కు కాల్ చేస్తే పోగొట్టుకున్న డబ్బులను తిరిగి రాబట్టుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఎక్కడికైనా టూర్ వెళ్లంటే స్టేటస్ పెట్టుకోవడం వల్ల స్థానికంగా లేరని నిర్ధారించుకొని, దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉంటుందన్నారు. మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే నేరుగా షీ టీంకు సమాచారం



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్ గౌడ్

అందించాలని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాలకు అన్ని రకాల ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలని, ప్రతీ వాహనదారుడు హెల్మెట్ వినియోగించాలని సూచించారు. అనంతరం స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించి యజమానులకు అందజేశారు. కార్యక్రమంలో రామగుండం సీఐ చంద్రశేఖర్ గౌడ్, ఎస్సై శరణ్య, అంతర్గాం ఎస్సై సంతోష్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనడం లేదని నిరసన



మంథని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

ధర్మారం(ధర్మపురి): మండలంలోని సాయంపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేయడంలో అవకతవకలకు పాల్పడుతున్నారని పేర్కొంటూ సాయంపేటకు చెందిన రైతు దయ్యాల రమేశ్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం నిరసనకు దిగారు. రెండు ధాన్యం బస్తాలతో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగాడు. నిర్వాహకులు పలుకుబడి ఉన్న రైతుల ధాన్యాన్ని ముందుగా తూకం వేస్తున్నారని, తమలాంటి వారిని పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పోలీసులు వచ్చి నిరసన విరమించాలని కోరారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వినోద్, సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు బలరాంరెడ్డితో మాట్లడారు. తూకం వేయిస్తామని హామీ ఇవ్వటంతో రమేశ్ ఇంటిముఖం పట్టాడు.

మంథనిలో రైతుల ధర్నా

మంథని: మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి పుట్టపాక వద్ద రైతులు శనివారం ధర్నాకు దిగారు. లారీల కొరత కారణం చూపుతూ ధాన్యం తూకం వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల నుంచి కేంద్రం వద్దే పడిగాపులు కాస్తున్నామని పేర్కొన్నారు. మంథని ఎస్సై వెంకటేశ్వర్లు చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. వేగంగా ధాన్యం జరిగేలా చూస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

ప్రశ్నించేతత్వం ప్రతిఒక్కరిలో పెరగాలి

పాలకుర్తి(రామగుండం): ప్రతి ఒక్కరిలో ప్రశ్నించేతత్వం పెరగాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎం.అర్జున్ సూచించారు. మండలంలోని బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా న్యాయాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. ఫ్యాక్టరీల కార్మికులకు ఆరోగ్య సమస్యలు వివరించారు. కనీస సౌకర్యాలు, సామాజిక, ఆర్థిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ఆయా యాజమాన్యాలపై ఉందన్నారు. ప్రజలందరికీ ఉచిత న్యాయసేవలు అందించేలా అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. కార్మికుల సంక్షేమానికి యాజమాన్యాలు చర్యలు చేపట్టాలని, లేకుంటే వారికి కోర్టులే న్యాయం చేస్తాయని స్పష్టం చేశారు. కంపెనీ ప్లాంట్‌హెడ్ శ్రీనివాస్‌రెడ్డి జడ్జిని సత్కరించారు. కార్యక్రమంలో పెద్దపల్లి బార్ అసోషియేషన్ బార్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శంకర్, మాజీ అధ్యక్షుడు సురేష్‌బాబు, ఈఎస్‌ఐ రామగుండం బ్రాంచి మేనేజర్ డీకే.రావు, గోదావరిఖని బార్ అసోషియేషన్ అధ్యక్షుడు మేడ చక్రపాణి, ఎస్సై వెంకటేశ్, కేశోరాం హెచ్‌ఆర్ మేనేజర్ గోవిందరావు న్యాయవాదులు, కార్మికులు పాల్గొన్నారు.

రుణ బంధం లఘుచిత్రం ఆవిష్కరణ

గోదావరిఖనిటౌన్(రామగుండం): స్థానిక దుర్గానగర్‌లోని ఓ ప్రైవేట్ డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో కళాకారుడు మోదంపల్లి రామస్వామి స్వీయరచన, దర్శకత్వంలో రూపొందించిన రుణ బంధం లఘు చిత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు దామెర శంకర్, గాయకుడు అందె సదానందం మాట్లాడుతూ.. అనాథ అమ్మాయిని చేరదీసి, ఉన్నత చదువులు చదివించి, ప్రయోజకురాలిని చేసే కథాంశంగా రూపొందించిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. కళాకారులు మంథన సంపత్, డాక్టర్ రాజేశ్వర్‌రావు, డ్యాన్స్ మాస్టర్ సర్వేశ్, గేయ రచయిత మూల శంకర్, నటీనటులు కంది నాగరాజు, శ్రీలత, బేబీ సహస్ర, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజక్షన్ వికటించి విద్యార్థిని మృతి

- రూ.6 లక్షల పరిహారం చెల్లించేందుకు ఆర్‌ఎంపీ అంగీకారం!



రవళి (ఫైల్)

పెద్దపల్లిరూరల్/ధర్మారం(ధర్మపురి): పెద్దపల్లి మండలంలోని పాలితం గ్రామానికి చెందిన గొట్టం రవళి(15) అనే విద్యార్థిని ధర్మారం మండలంలోని దొంగతుర్తికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు ముత్యాల శంకర్ ఇచ్చిన ఇంజక్షన్ వికటించడంతో మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. రవళి ఆరోగ్యం బాగా లేకపోవడంతో రెండు రోజులుగా ఆర్‌ఎంపీ వద్ద చికిత్స పొందుతోంది. శనివారం అతను ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే కిందపడిపోయింది. బాధితురాలి తల్లి మాధవి స్థానికుల సాయంతో ఆమెను పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే రవళి చనిపోయిందని నిర్ధారించారు. ఆర్‌ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యం వల్లే తన కూతురు మృతిచెందిందని మృతురాలి తల్లి ధర్మారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆర్‌ఎంపీ ఇచ్చిన ఇంజక్షన్ వికటించడం వల్లే రవళి ప్రాణం పోయిందని, మృతురాలి కుటుంబీకులకు పరిహారం చెల్లించాలని గ్రామపెద్దలు, నాయకులు డిమాండ్ చేశారు. దీంతో రూ.6 లక్షలు ఇచ్చేందుకు సదరు వైద్యుడు అంగీకరించినట్లు సమాచారం.

స్క్రాప్, ద్విచక్రవాహనం స్వాధీనం



గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థకు సంబంధించిన స్క్రాప్‌ను కొందరు చోరీ చేస్తున్నారని అధికారులకు సమాచారం వచ్చింది. సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ ఆదేశాలతో జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఉమేశ్ ఆధ్వర్యంలో జమేదార్ వెంకటేశ్వర్లు, ఇంటెలిజెన్స్ అధికారి రాధాకృష్ణ తదితరులు శనివారం ఉదయం విఠల్‌నగర్‌లో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో రైల్వే ట్రాక్ సులభ్ కాంప్లెక్స్ సమీపంలో కొంతమంది స్క్రాప్‌ను చోరీ చేస్తూ కనిపించారు. అధికారులను చూసిన నిందితులు స్క్రాప్‌తోపాటు ద్విచక్రవాహనాన్ని వదిలిపెట్టి, వెళ్లిపోయారు. స్క్రాప్, వాహనాన్ని గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు అధికారులు తెలిపారు. స్క్రాప్ విలువ రూ.76,250 ఉంటుందన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఆర్జీ–3 జీఎంకు సన్మానం

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వర్‌రావు ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సింగరేణి మైనింగ్ స్టాఫ్ కన్వీనర్ మాదాసు రామ్మూర్తి, కో–కన్వీనర్ నాగెల్లి సాంబయ్యల ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో వెంకటస్వామి, బత్తుల రమేశ్, శ్రీనివాస్, తాహెర్‌పాషా, అక్రమ్, మల్లయ్య పాల్గొన్నారు.

అధికారులు, ఉద్యోగులు..

గోదావరిఖని(రామగుండం): ఉద్యోగ విరమణ పొందనున్న ఆర్జీ–3 జీఎం వెంకటేశ్వర్‌రావును అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. శనివారం ఓసీపీ–1 ఉద్యోగుల సైట్ కార్యాలయంలో ఆయనకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. 1983లో సింగరేణి కంపెనీలో చేరి,



జీఎం వెంకటేశ్వర్‌రావును సన్మానిస్తున్న నాయకులు

వివిధ హోదాల్లో ఆయన అందించిన సేవలను కొనియాడారు. అధికారులు రాధాకృష్ణ, ప్రాజెక్టు ఇంజినీర్ శ్రీనివాస్, మేనేజర్ ఉదయ్ హరిజన్, గుర్తింపు సంఘం జనరల్ సెక్రటరీ మిర్యాల రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, పిట్ కార్యదర్శి వేగోళపు మల్లయ్య, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్

గోదావరిఖని(రామగుండం): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆర్జీ–2 జీఎం మనోహర్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో ముఖ్య అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 2 నుంచి 22 వరకు వేడుకలు జరపాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. 5న సింగరేణి అంతటా తెలంగాణ, సింగరేణి సంస్కృతిని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, కలిసి భోజనం వంటివి చేయాలన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్టేడియంలో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఎస్‌వోటూ జీఎం అబ్దుల్ సలీం, వకీల్‌పల్లి ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఏరియా ఇంజినీర్ నరసింహారావు, డీజీఎం పర్సనల్ అధికారి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం మనోహర్

అన్ని ఏరియాల్లో ఏర్పాట్లు..

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశాల మేరకు సింగరేణిలోని అన్ని ఏరియాల్లో సంబురాలు జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు రామ్మూర్తి, రామకృష్ణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

11వ వేజ్‌బోర్డు చరిత్రాత్మక ఒప్పందం

- సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డు ఒప్పందం చరిత్రాత్మకమని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. శనివారం ఆర్జీ–1 జీడీకే–2 ఇంక్లైన్ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. వేజ్‌బోర్డు ఒప్పందంలో మెరుగైన వేతన ఒప్పందంతోపాటు అలవెన్స్ పెంపుదలకు కృషి చేశామని తెలిపారు. త్వరలో ఏరియర్స్ బకాయిలు అందించేలా చూస్తామన్నారు. మారుపేర్లతో పని చేస్తున్న కార్మికులను వెంటనే వారి సొంత పేర్లకు మార్చేందుకు ఒప్పందం జరిగినప్పటికీ



మాట్లాడుతున్న సత్తయ్య

అమలు చేయని సింగరేణి యాజమాన్య నిర్లక్ష్య వైఖరిని ఖండించారు. ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిలు రూ.25 వేల కోట్లను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు హైపర్ కమిటీ వేతనాలు అమలు చేయాలన్నారు. నాయకులు ఆకుల హరిణ్, సతీశ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కొంత ఆలస్యమైనా మెరుగైన ఒప్పందమే

గోదారిఖని(రామగుండం): కొంత ఆలస్యమైనా బొగ్గు గని కార్మికుల 11వ వేజ్‌బోర్డు ఒప్పందం మెరుగైన ఒప్పందమేనని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శనివారం సింగరేణి ఆర్జీ–1 ఏరియాలోని జీడీకే–11వ ఇంక్లైన్ గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం, కోల్ ఇండియా యాజమాన్యం వల్లే వేజ్‌బోర్డు ఒప్పందం ఆలస్యమైందని ఆరోపించారు. జాతీయ కార్మిక సంఘాలు, కార్మికుల ఐక్యతతోనే మంచి అగ్రిమెంట్ చేసుకున్నట్లు తెలిపారు. వేజ్‌బోర్డులో బేసిక్ 19 శాతం, అలవెన్సులు 25 శాతం పెంచుకున్నట్లు పేర్కొన్నారు. జేబీసీసీఐ ఒప్పందాలను సింగరేణిలో అమలు చేయించడంలో గుర్తింపు సంఘం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జీడీకే 11 ఇంక్లైన్‌లోని కార్మికుల సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు పోషం, ఎల్లాగౌడ్, శ్రీనివాస్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న సీతారామయ్య

అవగాహన లేకుండా మాట్లాడొద్దు

- తెలంగాణ గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు చాంద్‌పాషా

గోదావరిఖని(రామగుండం): 11వ వేజ్‌బోర్డు ఒప్పందం తమ ఘనతేనని చెబుతూ సింగరేణి కార్మికులను జాతీయ సంఘాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని తెలంగాణ గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు చాంద్‌పాషా, ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ ఆరోపించారు. శనివారం గోదావరిఖనిలోని సంఘం కార్యాలయంలో మాట్లాడారు. అవగాహన లేకుండా మాట్లాడొద్దని, ఒప్పందాన్ని పూర్తిగా చదవాలని సూచించారు. ప్రశ్నించేవారిపై ఎదురుదాడి చేయడం సమంజసం కాదన్నారు. కేవలం ఆర్థిక పోరాటాలకు పరిమితమై, సర్కారుతో తలపడలేక ఘన విజయమని చెప్పుకోవడం దురదృష్టకరమన్నారు. బొగ్గు బ్లాకులు ప్రైవేట్ వైపు వెళ్తుంటే ఎందుకు ఆపలేకపోతున్నారని ప్రశ్నించారు. త్వరలోనే కార్మిక వర్గం ముందు అన్ని విషయాలను బట్టబయలు చేస్తామని పేర్కొన్నారు. నాయకులు బ్రహ్మానందం, వెంకన్న తదితరులున్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

సుల్తానాబాద్(పెద్దపల్లి): నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ సీఐ కృష్ణ, మండల వ్యవసాయశాఖ అధికారి డేవిడ్ రాజు హెచ్చరించారు. శనివారం సుల్తానాబాద్ పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నకిలీ పత్తి విత్తనాలు, కల్తీ ఎరువులు విక్రయించొద్దని సూచించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ఏవో ప్రత్యూష ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ సీఐ టీం శనివారం తనిఖీలు చేపట్టింది. టాస్క్‌ఫోర్స్ సీఐ కృష్ణ వడుకాపూర్‌లో పురుగు మందులు, విత్తన షాపుల్లో లైసెన్స్ పత్రాలు, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్‌ను పరిశీలించారు. పురుగు మందు డబ్బాలు డేట్ అయిపోయినవి అమ్మకూడదని, అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సుల్తానాబాద్: విత్తనాలు పరిశీలిస్తున్న సీఐ కృష్ణ

పెద్దపల్లి పట్టణంలో..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని పలు విత్తన, ఎరువుల దుకాణాల్లో వ్యవసాయాధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఏడీఏ శ్రీనాథ్, ఏవో అలివేణి విత్తన పాకెట్లు పరిశీలించడంతోపాటు నిల్వలను రికార్డులతో సరిపోల్చి చూశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సింగరేణి క్వార్టర్ల పరిశీలన

కమాన్‌పూర్(మంథని): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ క్వార్టర్లను ఎంపిక చేయడానికి శనివారం సెంటనరీకాలనీలో సింగరేణి అధికారులు, కార్మికులు నివాసం ఉండే ఎస్ టీ2, టీ2, సీ2 క్వార్టర్లను ఎంపిక కమిటీ సభ్యులు పరిశీలించారు. పచ్చదనం, విద్యుత్, నీటి పొదుపు, క్వార్టర్ల నిర్వహణ పలు అంశాలపై వివరాలు నమోదు చేసుకున్నారు. క్వార్టర్ల నిర్వాహకులకు జూన్ 5 నిర్వహించే వేడుకల్లో బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. సభ్యులు ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ఎస్ఈ పద్మరాజు, డీవైపీఎం మారుతి, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు గౌతం శంకరయ్య, రామారావు, తిరుపతి, కేశవరావు పాల్గొన్నారు.

